క్లుప్తంగా

పైప్‌లైన్‌కు మరమ్మతులు


మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

సాక్షి స్పందన

కెరమెరి: మండలంలోని సాకడ(బి)లో గడిచిన ఏడాది కాలంగా మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ కారణంగా వృథాగా పోతున్న నీటిపై సాక్షిలో 'వృథాగా భగీరథ నీరు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన మిషన్ భగీరథ అధికారులు శుక్రవారం పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టారు. ప్రొక్లెయినర్ సాయంతో మరమ్మతులు చేపట్టి కొత్త పైపులను బిగించినట్లు ఏఈ సంతోష్ తెలిపారు. సిబ్బంది భీంరాజు, మహేశ్, శ్యామ్, మండేరాం, విశాల్, సాయి ఉన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి


కూలీల హాజరు తీసుకుంటున్న ఎంపీడీవో

కెరమెరి: పెరుగుతున్న ఎండల నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో కృష్ణారావు అన్నారు. శుక్రవారం మండలంలోని మోడి గ్రామ శివారులో కొనసాగుతున్న ఉపాధిపనులను ఆయన పరిశీలించారు. కూలీల హాజరు తీసుకున్నారు. కనీసం రోజుకు రూ.250లకు తగ్గకుండా కూలీ వచ్చేలా పనులు చేయాలన్నారు. తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. టీఏ, ఎఫ్ఏలు ఉన్నారు.

హజ్ యాత్రికులకు సన్మానం


సన్మానిస్తున్న జామియా కమిటీ ప్రతినిధులు

ఆసిఫాబాద్అర్బన్: పట్టణం నుంచి 2024 సంవత్సరం హజ్‌యాత్రకు వెళ్లే యాత్రికులు షేక్ చాంద్, ముజఫర్ హుస్సేన్, అబ్దుల్ రహమాన్‌లను జామియా మసీద్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మసీద్ ఆవరణలో పూలమాలలతో ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో అబ్దుల్ ఫయాజ్, అన్సారి, జావిద్, సాలం, షబ్బీర్, అహ్మద్, షాహీద్, అమర్ బిన్ హసన్, రియాజ్, అబ్దుల్ బాసిత్, రహమత్‌నగర్ కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంబలి పంపిణీ


అంబలి పంపిణీ చేస్తున్న దేవార వినోద్

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్ బస్టాండ్ వద్ద దేవార వినోద్ యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబలి పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. శుక్రవారం యువసేన వ్యవస్థాపకుడు దేవార వినోద్ ప్రజలకు అంబలి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వేసవి ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజల దాహార్తి తీర్చేందుకు అంబలి పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ప్రజలు, ప్రయాణికులు అంబలి పంపిణీ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నాణ్యమైన వరి ధాన్యాన్ని తీసుకురావాలి


ధాన్యం పరిశీలిస్తున్న డీఎం వెంకటనరసింహ

దహెగాం: నాణ్యమైన ధాన్యాన్ని వరి కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకురావాలని సివిల్ సప్లయ్ డీఎం వెంకటనరసింహ అన్నారు. శుక్రవారం మండలంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యం తేమ శాతం 17లోపు ఉండేలా కళ్లాల్లో ఆరబెట్టాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట సీఈవో బక్కయ్య, సెంటర్ ఇన్‌చార్జీలు, ఏఈవోలు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీ లేనట్టేనా..?


గొర్రెల మంద

- రెండో విడుతపై అనుమానాలు
- అధికారులకు స్పష్టత కరువు
- డబ్బులు తిరిగివ్వాలని లబ్ధిదారుల డిమాండ్

ఆసిఫాబాద్‌రూరల్: గొల్లకుర్మల ఆర్థికాభివృద్ధి కోసం గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన గొర్రెల పంపిణీ కార్యక్రమంపై నీలినీడలు అలుముకున్నాయి. రెండో విడుత గొర్రెల పంపిణీ కోసం డీడీలు కట్టి ఐదేళ్లు గడుస్తున్నా నేటి వరకు గొర్రెలు పంపిణీ చేయకపోవడంతో లబ్ధిదారులు తాము కట్టిన డబ్బులు తిరిగివ్వాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలో పాత ప్రభుత్వం పడిపోయి కొత్త సర్కారు కొలువు దీరడంతో ఈ పథకం అమలవుతుందా..? లేదా..? అన్న అనుమానాలు లబ్ధిదారుల్లో తలెత్తుతున్నాయి. కాంగ్రెస్ సర్కారు ఈ పథకంలో ఏమైనా మార్పులు చేసి కొనసాగిస్తుందా.. లేదంటే రైతులు చెల్లించిన డబ్బులు తిరిగి ఇచ్చేస్తుందా అనేది స్పష్టత లేకపోవడంతో డీడీలు కట్టిన రైతులు ఆందోళన చెందుతున్నారు.

1513 యూనిట్లు..

పాత ప్రభుత్వం యాదవుల ఆర్థిక పరిపుష్టి కోసం 2018లో గొర్రెల పిణీ కార్యక్రమం చేపట్టింది. మొదటి విడుతలో భాగంగా కొంతమంది లబ్ధిదారులను ఎంపిక చేసి గొర్రెలు కూడా అందజేశారు. రెండో విడుత పంపిణీలో భాగంగా 2023 ఏప్రిల్‌లో మార్గదర్శకాలు విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా 1513 యూనిట్లను పంపిణీ కోసం గుర్తించగా ఒక్కో లబ్ధిదారుడు రూ.43,700 డీడీ రూపంలో డబ్బులు చెల్లించారు. కానీ వారికి నేటి వరకు గొర్రెలు పంపిణీ చేయకపోవడంతో వారిలో ఆందోళన మొదలైంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పాత స్కీంలు ఉంటాయా..? లేదా.. ? అన్న అనుమానాలతో ఆందోళన చెందుతున్నారు. కట్టిన డబ్బులు తిరిగివ్వాలని కార్యాలయానికి వచ్చి డిమాండ్ చేస్తుండడం పశుసంవర్ధక శాఖ అధికారులకు తలనొప్పిగా మారింది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు అధికారులు చెబుతున్నారు.

562 మంది లబ్ధిదారుల నిరీక్షణ..

రెండో విడుత గొర్రెల పంపిణీ కోసం జిల్లాలో 1513 మందిని ఎంపిక చేశారు. వీరిలో 562 మంది ఒక్కొక్కరు రూ.43,700 చొప్పున మొత్తం రూ.2,45,59,400 చెల్లించారు. 562 మందికి గాను 230 మందికి మాత్రమే ఇప్పటి వరకు గొర్రెలు పంపిణీ చేశారు. మిగతా 332 మంది డీడీలు కట్టి గొర్రెల కోసం ఎదురు చూస్తున్నారు. జూన్, 2023లో రెండో విడుత పంపిణీకి అప్పటి ప్రభుత్వం సిద్ధమైంది. లబ్ధిదారుల నుంచి డీడీలు కట్టించుకున్నా వేగంగా గొర్రెలు పంపిణీ మాత్రం చేయలేకపోయింది. ఇదే సమయంలో ప్రభుత్వం మారడంతో డీడీలు కట్టిన లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

డబ్బులు తిరిగి చెల్లించాలి



గొర్రెల కోసం డీడీ కట్టి ఆరు నెలలవుతోంది. ఇప్పటి వరకు గొర్రెలు ఇవ్వలేదు. నా దగ్గర లేకుంటే రూ.40 వేలు అప్పు తెచ్చి డీడీ కట్టిన. అధికారులు చొరవ తీసుకొని గొర్రెలు పంపిణీ చేయాలి. లేదంటే మేం కట్టిన డీడీ డబ్బులైనా తిరిగివ్వాలి. – శ్రీనివాస్, కెరమెరి

15 నెలలు గడిచింది



రెండో విడత సబ్సిడీ గొర్రెల కోసం రూ.43,700 డీడీ కట్టి 15 నెలల గడిచింది. కానీ గొర్రెలు మాత్రం రాలేదు. నూతన ప్రభుత్వం గొర్రెల పంపిణీపై నిర్ణయం తీసుకొని లబ్ధిదారులకు న్యాయం చేయాలి. – సాగర్, బూర్గుడ

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

జిల్లాలో రెండో విడత గొర్రెల సబ్సిడీ కోసం 332మంది డీడీలు కట్టారు. లబ్ధిదారులు డబ్బులు తిరిగివ్వాలని చేస్తున్న డిమాండ్‌ను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే తగు నిర్ణయం తీసుకుంటాం.

– సురేశ్ కుమార్, పశు సంవర్ధకశాఖ అధికారి

పగటి ఉష్ణోగ్రతలు.. భగభగ


కాగజ్‌నగర్‌లో ఎండ తీవ్రతకు టోపీ ధరించి ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

జిల్లాలో శుక్రవారం నమోదైన పగటి ఉష్ణోగ్రతలు (డిగ్రీ సెల్సియస్‌లలో..)

ప్రాంతం	గరిష్ఠం
ఎల్కపల్లి	45.5
జంబుగా	45.3
కాగజ్‌నగర్	45.3
వంకులం	45.0
వాంకిడి	45.0
తిర్యాణి	44.8
ఆసిఫాబాద్	44.4
కుంచవెల్లి	44.3
బెజ్జూర్	44.0
ధనోరా	44.0
కౌటాల	44.0

కౌటాల: ఎండలు విపరీతంగా పెరగడంతో వాతావరణ శాఖ జిల్లాను రెడ్‌జోన్‌గా ప్రకటించింది. జిల్లాలో గత నాలుగు రోజుల నుంచి 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శుక్రవారం భారీగా పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలోని ఎల్కపల్లిలో అత్యధికంగా 45.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు కాగా కాగజ్‌నగర్‌లోని జంబుగాలో సైతం 45.3, కాగజ్‌నగర్‌లో 45.3, వంకులంలో 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గాలిలో తేమ తగ్గిపోవడంతో ఉదయం 8 గంటల నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. జిల్లాలోని కాగజ్‌నగర్, రెబ్బెన, పెంచికల్‌పేట్ మండలాలు వార్నింగ్ జోన్‌లో ఉండగా మిగతా 12 మండలాలు అలెర్ట్ జోన్‌లో ఉన్నాయి.

పోస్టల్ బ్యాలెట్ సద్వినియోగం చేసుకోవాలి


ఓటింగ్ సరళి పరిశీలిస్తున్న దీపక్ తివారి

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: ఎంపీ ఎన్నికల విధులు నిర్వహించే ప్రతీఉద్యోగి పోస్టల్ బ్యాలెట్ ఏర్పాటు సద్వినియోగం చేసుకోవాలని సిర్పూర్ నియోజకవర్గ సహాయ ఎన్నికల అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సరళిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆర్డీవో కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వినియోగించుకోవాలన్నారు. 1400 మంది ఉద్యోగులు ఈ ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటు వేసేందుకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఆయన వెంట అధికారులు సురేశ్ తదితరులు ఉన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

జైనూర్: విద్యుదాఘాతానికి ఇల్లు కాలి బూడిదైన సంఘటన మండలంలోని జామిని గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని జామిని గ్రామంలో కరాడ్ మాధవ్‌కు చెందిన పెంకుటింట్లో శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. పెంకుటిళ్లు కావడంతో స్థానికులు మంటలు ఆర్పేలోగా ఇల్లు పూర్తిగా కాలిబూడిదైంది. నిత్యావసర సరుకులతో పాటు సామగ్రి పూర్తిగా కాలిపోయింది. గూడు కోల్పోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు వేడుకుంటున్నారు.

'నగేశ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలి'


బొంబాయిగూడలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

పెంచికల్‌పేట్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్‌ను భారీ మెజారిటీతో ఆశీర్వదించాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. శుక్రవారం మండలంలోని బొంబాయిగూడ, పోతెపల్లి, చేడ్వాయి, దరోగపల్లి గ్రామాల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమలుకు నోచుకోని హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేక కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఈనెల 5న కాగజ్‌నగర్ పట్టణంలో నిర్వహించ తలపెట్టిన వికాస సంకల్ప సభకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా రానున్న నేపథ్యంలో పెద్దఎత్తున బీజేపీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు జునుగరి మధుకర్, చప్పిడే సత్యనారాయణ, కాంతారావు, శివకుమార్, మహేశ్, ప్రభాకర్, సాయిరి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

'బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం'


కెరమెరి: ప్రచారం చేస్తున్న నాయకులు

కెరమెరి: బీఆర్‌ఎస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమని జెడ్పీటీసీ దుర్పతబాయి అన్నారు. శుక్రవారం మండలంలోని చింతకర్ర, తోయగూడ, మడావిగూడ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు కారు గుర్తుకే ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాయకులు ఆనంద్‌రావు, రాజయ్య, భీంరావు, రఘునాద్, రాంచందర్, జాహెద్ ఖాన్, మున్ను, తదితరులు ఉన్నారు.

వాంకిడిలో..

వాంకిడి: రాష్ట్ర అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యపడుతుందని జెడ్పీటీసీ అజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని ఖిరిడి, ఇందాని, నవేగూడ గ్రామ పంచాయతీల్లో పార్టీ కార్యకర్తలతో కలిసి ఎంపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడపగడపకు తిరుగుతూ గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. వైస్ ఎంపీపీ రాజ్‌కుమార్, నాయకులు బండె తుకారాం, అశోక్ మహోల్కర్, సెండె వాసు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించాలి


ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రెబ్బెన: కాంగ్రెస్‌తోనే దేశంలో అభివృద్ధి సాధ్యమవుతుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. శుక్రవారం గోలేటిలో ఉపాధిహామీ పని ప్రదేశంలో కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎన్నికల మెనిఫెస్టోను కూలీలకు వివరించారు. పార్టీ నాయకులు మాట్లాడుతూ నరేంద్రమోదీ గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దుర్గం రవీందర్, ప్రకాశ్‌రావు, జిల్లాల స్వామి, సాంబగౌడ్, పూదరి సాయి, దుర్గం తిరుపతి, మంగీలాల్, గట్టయ్య, విమల తదితరులు పాల్గొన్నారు.

పూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణ


విగ్రహావిష్కరణలో మాలీ సంఘం నాయకులు

వాంకిడి: మండలంలోని ధాబా గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన మహాత్మ జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని మాలీ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ పటేల్ మొహర్లే మహేందర్ జెండా ఎగురవేయగా, మాలీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుర్నులె నారాయణ విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాత్మ పూలే దంపతులు దేశానికి చేవలు మరువలేనివని, ప్రతి ఒక్కరూ పూలే దంపతులు చూపిన మార్గంలో నడవాలన్నారు. మాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగోషే శంకర్, మండల అధ్యక్షుడు వడై బాబురావు, భూదాత కోట్నాక మల్కు, కవి, సాహితి ప్రవక్త మధు బావలకర్, నాయకులు సెండె శంకర్, గుర్నులె మెంగాజీ, సెండె వాసు, రాఘవ, దివాకర్ పాల్గొన్నారు.

బస్టాండ్ కోసం నిరీక్షణ

- ఏళ్లుగా తిప్పలు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


బస్సులు నిలుపని స్థలంలో ప్రయాణ ప్రాంగణం బోర్డు


బస్టాండ్ నిర్మాణానికి కేటాయించిన స్థలంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షెడ్డు

సిర్పూర్(టి): నియోజకవర్గ కేంద్రం సిర్పూర్(టి)లో బస్టాండ్ నిర్మాణానికి ప్రజలు దశాబ్దాలుగా నిరీక్షిస్తున్నారు. మండల కేంద్రం మీదుగా నియోజకవర్గంలోని ఆయా గ్రామాల ప్రజలతో పాటు మహారాష్ట్ర గ్రామాలకు చెందిన వారు ప్రతీరోజు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండ్ లేకపోవడంతో మండల కేంద్రం గుండా వెళ్లే ప్రజలు, ప్రయాణికులు నానా తిప్పలు పడుతున్నారు.

2003లో శంకుస్థాపన..

మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు నిత్యం వివిధ పనుల నిమిత్తం మండలకేంద్రానికి వస్తుంటారు. స్థానికంగా బస్టాండ్ ప్రాంతంలో ఎలాంటి వసతులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారు. స్థానికంగా వేచి ఉండే స్థలం లేకపోవడంతో ప్రయాణికులు పడే బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. మండల కేంద్రంలోని సిర్పూర్(టి) –కౌటాల, సిర్పూర్(టి) –మాకిడి ప్రధాన రహదారుల కూడలి వద్ద బస్టాండ్ నిర్మాణానికి 2003లో అప్పటి ప్రజాప్రతినిధులు రూ. 5లక్షలు మంజూరు చేసి శిలాఫలకం వేశారు. కానీ పనులు ప్రారంభం కాకపోవడంతో బస్టాండ్ నిర్మాణం జరగలేదు. అనంతరం సిర్పూర్(టి) గ్రామపంచాయతీ నిధులతో బస్టాండ్ నిర్మాణ స్థలంలో వ్యాపార సముదాయాల భవనం నిర్మాణం చేపట్టడంతో బస్టాండ్ నిర్మాణానికి స్థలం లేకుండా పోయింది.

ఐదేళ్ల క్రితం తాత్కాలిక షెడ్డు ఏర్పాటు..

గత ఐదేళ్ల క్రితం బస్టాండ్ నిర్మాణానికి స్థానిక బీసీ బాలుర వసతి గృహం స్థలాన్ని కేటాయించి తాత్కాలికంగా బస్టాండ్ షెడ్డు ఏర్పాటు చేశారు. నూతన బస్టాండ్ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని చెప్పినా నేటికీ బస్టాండ్ నిర్మాణం చేపట్టలేదు. ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నా సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో నియోజకవర్గ ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండలకేంద్రంలో బస్టాండ్ నిర్మాణం చేపట్టి ప్రజల సౌకర్యార్థం వసతులు కల్పించాలని మండలవాసులు కోరుతున్నారు.

అవస్థలు వర్ణనాతీతం



మండల కేంద్రానికి వచ్చే మహిళా ప్రయాణికులు స్థానిక బస్టాండ్ ప్రాంతంలో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో పడే ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి. సంబంధిత శాఖ అధికారులు స్పందించి బస్టాండ్ నిర్మాణం చేపట్టాలి.

– లక్ష్మణ్, పాతట్లగూడెం

నిరుపయోగంగా తాత్కాలిక షెడ్డు..



మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట తాత్కాలికంగా బస్టాండ్ షెడ్డు నిర్మించి వదిలేశారు. ఈ స్థలంలో బస్టాండ్ నిర్మాణం చేపడుతామని చెప్పి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునే వారు లేదు. తాత్కాలిక షెడ్డు నిరుపయోగంగా మారింది.

– షారుఖ్, సిర్పూర్(టి)

అధికారులు చొరవ చూపాలి



సిర్పూర్(టి)లో బస్టాండ్ లేకపోవడంతో నియోజకవర్గ ప్రజలతో పాటు మహారాష్ట్ర గ్రామాల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు చొరవ తీసుకొని బస్టాండ్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలి.

– అనిల్, సిర్పూర్(టి)

బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగం


కాగజ్‌నగర్‌లో పోస్టల్ బ్యాలెట్‌లో ఓటు వేసిన ఉపాధ్యాయులు

పెంచికల్‌పేట్: ఎన్నికల సంఘం వృద్ధులకు, దివ్యాంగులు, నడవలేని వారికి ఇంటి వద్దే ఓటు వేసే అవకాశం కల్పించగా శుక్రవారం మండలంలోని పలువురు ఓటుహక్కును వినియోగించుకున్నారు. దరోగపల్లిలో ఇద్దరు, కొత్తగూడ(చేడ్వాయి)లో ఇద్దరు ముందస్తుగా ఓటు వేశారు. హోమ్ పోలింగ్ ప్రక్రియను అధికారులు పూర్తిగా కెమెరాల ద్వారా చిత్రీకరించారు. పోలింగ్ అధికారి, అదనపు పోలింగ్ అధికారి, సిబ్బంది, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

కౌటాల/ కాగజ్‌నగర్‌రూరల్: ఎంపీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల పోలింగ్ సిబ్బందికి, వృద్ధులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వినియోగించుకునేందుకు అవకాశం కల్పించారు. ఈనేపథ్యంలో కాగజ్‌నగర్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం ఉపాధ్యాయులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేశారు. కౌటాల మండలంలో ఆరుగురు వృద్ధులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు.

'నరేంద్ర మోడీతోనే ఎస్సీ వర్గీకరణ'

ఆసిఫాబాద్: దేశంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి వస్తేనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమవుతుందని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవరావు మాదిగ అన్నారు. ఇతర నాయకులతో కలిసి ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం జిల్లా కేంద్రంలో బీజేపీ డోర్ పోస్టర్లను ఆవిష్కరించారు.